సాక్షి అన్నమయ్య జిల్లా

సోమవారం, 4, ఆగస్టు, 2025



నల్లతుమ్మ చెట్ల అక్రమ రవాణా

మంచూరు గ్రామ పంచాయతీ పరిధిలో సర్పంచ్ జ్యోతి, భర్త సురేష్ నిబంధనలను తుంగలో తొక్కి నల్లతుమ్మ చెట్లను విక్రయించి సొమ్ము చేసుకున్న ఘటన వెలుగు చూసింది. -8లో



సెప్టెంబర్ 8 నుంచి జాతీయ కౌన్సిల్ సమావేశాలు

సెప్టెంబర్‌లో అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కౌన్సిల్ సమావేశాలు కడపలో నిర్వహించనున్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.380	రూ.470
రెండోరకం	రూ.200	రూ.360

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 290 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

మల్లయ్యకొండకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్యకొండకు సోమవారం ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్టు ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఉదయం 5.30 గంటలకు, 6.30 గంటలకు మదనపల్లె డిపో నుంచి బయలుదేరి మల్లయ్యకొండకు చేరుతుందన్నారు. తంబళ్లపల్లె రాగిమాను సర్కిల్ నుంచి మల్లయ్యకొండకు సాయంత్రం వరకు షటిల్ సర్వీసు నడుస్తుందన్నారు. భక్తులకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాయచోటి: ప్రజల నుంచి సమస్యలను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు ఈనెల 4వ తేదీన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వ హిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటితోపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్జీదారులు తమ అర్జీలను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రావాలని ఆయన పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి జగదాంబసెంటర్: జిల్లాలోని మదనపల్లె మండలం వలసపల్లెలో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి 11వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎం.గీత ఒక ప్రకటనలో తెలిపారు. 2024 -2025 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పాసైన విద్యార్థులు ఈ నెల 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. www.navodaya.gov.in అనే వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. పూర్తి చేసిన అనంతరం ఆఫీస్ పనివేళల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలలోపు సమర్పించాలని ప్రిన్సిపాల్ తెలియజేశారు.

వెలిగల్లు కుడికాలువకు నీరు విడుదల

గాలివీడు: రైతుల సంక్షేమమే ధ్యేయమని రాష్ట్ర యువజన,రవాణా,క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. ఆదివారం తన సోదరుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి, స్థానిక టీడీపీ నాయకులతో కలసి మండలంలోని వెలిగల్లు జలాశయం కుడికాలువ నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రైతుల సౌకర్యార్థం కుడికాలువ ద్వారా నీటిని 0.5 టీఎంసీలు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. వెలిగల్లు జలాశయంలో ప్రస్తుతం 2.681 టీఎంసీల నీరు నిల్వ ఉందని, అందులో లైవ్ స్టోరేజ్ 1.47 టీఎంసీలు కాగా, తాగునీటి కోసం 0.40 టీఎంసీలు కేటాయించినట్లు తెలిపారు.

చెస్‌లో క్రీడాకారుల ప్రతిభ

కడప వైఎస్ఆర్ సర్కిల్: బెంగుళూరులో జరిగిన 3వ చెస్ ఫ్యూషన్ నేషనల్ లెవల్ చెస్ టోర్నమెంట్‌లో జిల్లాకు చెందిన చెస్ క్రీడాకారులు ప్రతిభ చాటారని చెస్ కోచ్ అనీష్ దర్బారీ పేర్కొన్నారు. బెంగుళూరులోని గోల్డెన్ బీ గ్లోబల్ స్కూల్‌లో జరిగిన 3వ చెస్ ఫ్యూషన్ నేషనల్ లెవల్ చెస్ టోర్నమెంట్‌లో అండర్-8లో బాలికల విభాగంలోజిల్లాకు చెందిన వినమత్ర 5 స్థానంలో నిలిచి ట్రోఫీ గెలుచుకుందన్నారు. అండర్ -10లో బాలికల విభాగంలో ప్రొద్దుటూరు చెందిన ధనిత 8వ స్థానంలో నిలిచి మెడల్ అందుకుందన్నారు. మొత్తం 7 రౌండ్‌లలో జిల్లా చెస్ క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనపరిచినట్లు కోచ్ పేర్కొన్నారు. కాగా కాగా సీనియర్స్ విభాగంలో చెస్ కోచ్ అనీష్ దర్బారీ ప్రథమ స్థానంలో నిలిచి నగదు బహుమతి అందుకోవడం విశేషం.

పోలీసుల గస్తీ



పెన్నానది లోలెవల్ కాజ్‌వే వద్ద ఉన్న పోలీసులు

సిద్దవటం: సిద్దవటం పెన్నానదిపై ఉన్న లోలెవల్ కాజ్‌వే పై పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ సుబ్బరామచంద్ర మాట్లాడుతూ సిద్దవటం వద్ద పెన్నానది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఆదివారం పర్యాటకులు ఎక్కువగా వస్తుంటారన్నారు. ఒంటిమిట్ట సీఐ బాబు, సిద్దవటం ఎస్ఐ సూచనల మేరకు కాజ్‌వేపైన పోలీసుల బందోబస్తును ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యగా అక్కడికి పర్యాటకులను రానివ్వలేదన్నారు. ఉదయం చేపలు పట్టే వారు వస్తే వారిని కూడా పంపిచేశామన్నారు.కొత్త వ్యక్తులు ఎవరైనా వచ్చి నదిలోకి దిగుతారనే ఉద్దేశంతో కాజ్‌వే వద్ద ఉన్నామని ఏఎస్ఐ తెలిపారు.

కొర్రీలతో కోతలు!

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2023-24లో జిల్లాలో 2,03,374 మందికి రైతు భరోసా నిధులు జమ
- కూటమి ప్రభుత్వంలో 1,88,408 మందికే అన్నదాత సుఖీభవ
- 14,966 మందికి ఎగనామం
- తొలి విడతలో రూ.10.47 కోట్లు నష్టపోయిన రైతాంగం



మదనపల్లె: వ్యవసాయ రైతులకు అండగా నిలవడంలో విశాల దృక్పదంతో వ్యహరించాల్సిన కూటమి ప్రభుత్వం కక్షకట్టి కొర్రీలతో ఆర్థిక సాయానికి కోతలు వేసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వెబ్‌ల్యాండ్‌లో నమోదైన ప్రతి రైతుకూ రైతు భరోసా ఆర్థిక చేయూత నిధులును అందించగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి రైతుకూ అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20వేలు ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించారు. అయితే వాస్తవ పరిస్థితికి రాగానే పథకం అమలుకు కొర్రీలు వేయడంతో రైతుల సంఖ్యలో కోతలు విధించిన ప్రభుత్వం నిధులు మిగిల్చుకుంది. దీంతో జిల్లా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

నాడు వెబ్‌ల్యాండ్ ఆధారంగా...

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు రైతులకు అందించిన రైతు భరోసా పథకానికి వెబ్‌ల్యాండ్‌లో భూమి ఉందా లేదా అని మాత్రమే పరిశీలించి పేర్లున్న ప్రతిరైతుకు ఆర్థిక భరోసా ఇస్తూ ఏటా రూ.13,500 సహాయం అందించారు. దీనివల్ల ఒక్క రైతుకు నష్టం కలగలేదు. అందరికీ సహాయం అందింది. ఐదేళ్లలో జిల్లాలో 10,08,190 మంది రైతులకు రూ.756.14 కోట్ల రాష్ట్రప్రభుత్వ వాటా, రూ.604.91 కోట్ల కేంద్రప్రభుత్వ వాటాను చెల్లించారు. దీంతో రైతుల్లో సంతృప్తి వ్యక్తమైంది.

ఇప్పుడు కొర్రీలు

కూటమి ప్రభుత్వం ప్రతి రైతుకు రూ.20వేల పెట్టుబడి సాయాన్ని ఏటా ఇస్తామని ప్రకటించింది. అయితే మొదటి ఏడాది రైతులకు ఎగనామం పెట్టిన ప్రభుత్వం..రెండో ఏడాదిలో దీన్ని అమలు చేయడం కోసం కొర్రీలు విధించింది. ప్రధానంగా వెబ్‌ల్యాండ్‌లో రైతుల వివరాలను చూసే అవకాశాన్ని వ్యవసాయశాఖ అధికారులకు ప్రభుత్వం కల్పించింది. మొదట స్థానిక అధికారులు భూ వివరాలను పరిశీలించాక ఎంపిక చేసిన జాబితాలను ఒక్కో పై అధికారికి నివేదిస్తూ కమిషనర్‌కి చేరుస్తారు. ఈ జాబితాలో ఎవరైనా రైతులు ఆదాయ పన్ను చెల్లిస్తున్నా, అధిక ఆస్తులు కలిగి వున్నా, వారి పేర్లను జాబితాల నుంచి తొలగించారు. అనర్హుల పేరుతో రైతుల పేర్లు తొలగించాక మళ్లీ జాబితాలను మండలస్థాయి అధికారులకు పంపి వారి అనుమతితో తుది జాబితాలను సిద్ధం చేశారు. వీరికి మాత్రమే అన్నదాత సుఖీభవ పథకానికి అర్హత కల్పించారు.

14,966 మందికి మొండిచెయ్యి

జిల్లాలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో చివరి ఏడాది 2023-24లో 2,03,374 మందికి రైతు భరోసా పథకం అమలు చేసింది. ఇదే విధంగా అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయాల్సింది. అలా కాకుండా కొర్రీలతో కోతలు వేసిన ఫలితంగా జిల్లాలో 14,966 మంది రైతులు అనర్హులయ్యారు. వీరు పథకం తొలి విడత నిధులు రూ.10,47 కోట్ల ఆర్థిక సహాయన్ని పొందలేకపోయారు. రైతుల జాబితాలో కోత విధించిన ప్రభుత్వం ఆ మేరకు నిధులు మిగుల్చుకుంది. కరువుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతాంగానికి అండగా నిలవాల్సిన ప్రభుత్వం పథకం అమలులో మొండిచెయ్యి చూపింది. ఈ లెక్కన అర్హత కోల్పోయిన రైతులు ఏడాది మొత్తానికి రూ.20వేలు చొప్పున రూ.299.32 కోట్లు నష్టపోతున్నారు.

ఏడాదిలో రూ.284 కోట్లు కోల్పోయారు

కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకాన్ని తొలి ఏడాది అమలు చేయకపోవడంతో జిల్లా రైతులకు రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.284 కోట్లు అందక నష్టపోయారు. 2023-24లో జిల్లాలో 2,03,374 మంది రైతుల సంఖ్యకు ఒక్కొక్కరికి రూ.14వేలు చొప్పున చెల్లించాల్సిన మొత్తం ఇది. ఈ స్థాయిలో రైతులు పెట్టుబడి సహాయాన్ని పొందలేకపోయారు. తొలి ఏడాది అమలు చేయని కారణంగా ప్రభుత్వం నిధులు మిగుల్చుకున్నట్టయ్యింది. రైతులకు మాత్రం ప్రభుత్వం నుంచి భరోసా దక్కలేదు.

ఉదాహరణకు తంబళ్లపల్లెలో తగ్గించిన రైతుల సంఖ్య పరిశీలిస్తే


మండలం	జగన్ పాలనలో	ప్రస్తుతం	తగ్గించింది
తంబళ్లపల్లె	9,074	8,273	801
ములకలచెరువు	7,799	7,458	341
పెద్దతిప్పసముద్రం	10,848	9,986	862
బి.కొత్తకోట	7,830	7,413	417
కురబలకోట	6,444	5,463	981
పెద్దమండ్యం	6,751	6,274	477

అన్నదాత సుఖీభవ లబ్ధిదారులు

నియోజకవర్గం	రైతులు	లబ్ధి (రూ.కోట్లలో)
రాజంపేట	39,031	27.33
పీలేరు	38,490	26.94
మదనపల్లె	20,162	14.11
తంబళ్లపల్లె	44,867	31.41
రాజంపేట	21,236	14.87
కోడూరు	24,622	17.24
మొత్తం	1,88,408	127.88

వైఎస్సార్‌సీపీ పాలనలో

ఏడాది	రైతులు	లబ్ధి(రూ.కోట్లలో)
2019-20	1,96,010	264,61
2020-21	2,05,716	277.71
2021-22	2,04,133	275.57
2022-23	1,98,957	268.59
2023-24	2,03,374	274.55
మొత్తం	10,08,190	1,361.03



గల్ఫ్ సమస్యల పరిష్కారానికి కృషి

- రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ్‌రెడ్డి



మేడా రఘునాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న గల్ఫ్‌దేశాల వైఎస్సార్‌సీపీ నేతలు

రాజంపేట: గల్ఫ్‌వాసుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ్‌రెడ్డిఅన్నారు. ఆదివారం మేడా భవన్‌లో వైఎస్సార్‌సీపీ గల్ఫ్ నేతలు ఆయనను కలిశారు. శాలువా కప్పి సన్మానించారు. గల్ఫ్ దేశాల నుంచి నేరుగా తిరుపతి విమానాశ్రయంలో రాకపోకలను కొనసాగించేలా తన వంతు కృషి చేస్తానన్నారు. గల్ఫ్ దేశాల్లో వైఎస్సార్‌సీపీ నేతల సేవలు ప్రశంసనీయమన్నారు.కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గల్ఫ్ కన్వీనర్ ఇలియాస్, అడ్వైజర్ మహేశ్వర్‌రెడ్డి, కో కన్వీనర్ మన్సూర్ చంద్రశేఖర్‌రెడ్డి, గల్ఫ్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు వి.పి రామచంద్రారెడ్డి, పులపత్తూరు సురేష్‌రెడ్డి, ఎస్ఆర్ఐలు రాజాసాబ్, గోపాలరెడ్డి పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

కడప ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆదివారం కడపలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎలక్షన్ ఆఫీసర్ నిత్యపూజయ్య ఆధ్వర్యంలో నామినేషన్ స్వీకరణ చేపట్టగా అన్ని పోస్టులకు ఒక్కో నామినేషన్ చొప్పున దాఖలు అయ్యాయి. దీంతో ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఇందులో ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షుడిగా సురేష్, కార్యదర్శిగా వెంకటసుబ్బయ్య, వైస్ ప్రెసిడెంట్‌గా ఖాదర్ హుస్సేన్, జాయింట్ సెక్రటరీగా మల్లికార్జునరాజు, ట్రెజరర్‌గా రాధాకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా శివప్రసాద్, ఉమెన్ సెక్రటరీగా ఇందుమతి, ఈసీ మెంబర్లుగా బాలనరసయ్య, శివప్రసాద్, చరణ్‌లు ఎన్నికయ్యారు.

ఉప ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలి



అనుబంధ సంఘాల అధ్యక్షులతో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి

వైఎస్సార్‌సీపీ వైఎస్సార్ కడప జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి పిలుపు

కడప కార్పొరేషన్: పులివెందుల, ఒంటిమిట్ట మండలాల్లో జరుగుతున్న జిల్లా పరిషత్ ఉప ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ వైఎస్సార్ కడప జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన అనుంబంధ విభాగాల అధ్యక్షుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉప ఎన్నికల్లో ఎలాగైనా గెలిచేందుకు అధికార టీడీపీ ఎన్ని అడ్డదారులైనా తొక్కుతుందన్నారు. పోలీసులను ఉపయోగించి వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు కూడా బనాయిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వ 14 నెలల పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. రూ.1.87లక్షల కోట్లు అప్పులు చేసి ఏ ఒక్క సంక్షేమ పథకమూ సక్రమంగా అమలు చేయలేద న్నారు. తల్లికివందనం, అన్నదాత సుఖీభవ పథకాల్లో లబ్ధిదారులను కోత కోశారన్నారు. ప్రశ్నించే వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారన్నారు. ఈ దుర్మార్గ పాలనను ప్రజలు గమని స్తున్నారని, జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారన్నారు. ప్రచార కార్యక్రమంలో అనుబంధ సంఘాల అధ్యక్షులు పాల్గొని ఇంటింటి ప్రచారం చేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పులి సునీల్ కుమార్, పాకా సురేష్, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఎస్.వెంకటేశ్వర్లు, టీపీ వెంకట సుబ్బమ్మ, జాషువా, ఆదిత్యతదితరులు పాల్గొన్నారు.

ఉప పోరు.. ప్రచార హోరు



ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో ఆకేపాటి

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నిక ప్రచారంలో వైఎస్సార్‌సీపీ జోరుగా ఇంటింటి ప్రచారం చేసింది. ఆదివారం మండల పరిధిలోని దర్జిపల్లి, గొల్లపల్లి, దవంతరపల్లి, నరసన్నగారిపల్లి, పెన్నపేరూరు, తప్పెటవారిపల్లి గ్రామాల్లో అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డితో కలిసి పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆకేపాటి మాట్లాడుతూ జిల్లా ప్రజా పరిషత్‌కు సంబంధించిన నిధులు మండల అభివృద్ధికి వినియోగించాలంటే వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డిని గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీకి వేసే ప్రతి ఓటు కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు చేసిన మోసానికి చెప్పపెట్టు అన్నారు. సోమశిల ముంపు వాసులకు నష్ట పరిహారం అప్పటి ప్రభుత్వం తక్కువగా ఇస్తే ఇక్కడి రైతులతో కలిసి తాము ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని గుర్తుచేశారు.

నమ్మకాన్ని నిలబెట్టుకుంటా


జడ్పీటీసీ అభ్యర్థి ఇరగంరెడ్డి మాట్లాడుతూ తనపై వైఎస్సార్‌సీపీ పెట్టుకున్న నమ్మకానికి మండల ప్రజల గుండెల్లో స్థానాన్ని సంపాదించుకొని, ఉప ఎన్నికలో తప్పక విజయం సాధించి, వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి ఏకుల రాజేశ్వరిరెడ్డి, వైఎస్సార్‌సీపీ ఒంటిమిట్ట మండల అధ్యక్షుడు టక్కోలు శివారెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, రాజంపేట నియోజకవర్గ యూత్ వింగ్ అధ్యక్షుడు కూండ్ల ఓబుల్ రెడ్డి, ఒంటిమిట్ట మండల పంచాయతీ రాజ్ అధ్యక్షుడు మేరువ శివనారాయణ, గొల్లపల్లి సర్పంచ్ దున్నూతల లక్ష్మీనారాయణరెడ్డి, పెన్నపేరూరు ఎంపీటీసీ ముమ్మడి నారాయణరెడ్డి, కొత్తమాధవరం 1,2,3 వార్డుల సర్పంచ్ చేపూరి ఓబయ్య, మండల ప్రచారం విభాగం అధ్యక్షుడు రాజశేఖర్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

ఏకశిలానగిరిలో జెడ్పీ ఎన్నికల సందడి!

- ప్రచారంలో ముందంజలో వైఎస్సార్‌సీపీ
- కూటమిలో అభ్యర్థుల ఎంపిక గందరగోళం

రాజంపేట: ఒంటిమిట్ట కోదండరామస్వామి క్షేత్రమైన ఏకశిలానగరం(ఒంటిమిట్ట)లో జెడ్పీ ఎన్నికల సందడి మొదలైంది. శుక్రవారంతో జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ (జెడ్పీటీసీ) స్థానానికి నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. ఈనెల 5వ తేదీవరకు నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియను నిర్వహించనున్నారు. 12న పోలింగ్, 14న కౌంటింగ్ ప్రకియ జరగనుంది. రాష్ట్ర అధికారిక రామాలయం కలిగిన ప్రాంతం కావడంతో ఇక్కడ జెడ్పీటీసీ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారనున్నాయి.

- 1994-1995లో జిల్లాపరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుల ఎన్నిక ప్రారంభమైంది. తొలి జెడ్పీటీసీగా 1995లో తోకా నరసింహులు ఎన్నికయ్యారు. అనంతరామయ్య, ఇరంగరెడ్డి రాజ్యలక్ష్మీ, ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, ఆకేపాటి అమరనాథరెడ్డిలు జెడ్పీటీసీలుగా ఒంటిమిట్టకు ప్రాతినిధ్యం వహించారు. ప్రస్తుతం ఎమ్మెల్యే,వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథరెడ్డి ఒంటిమిట్ట నుంచి జిల్లా పరిషత్ చైర్మన్‌కు ఎంపికయ్యారు. అలాగే ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి కూడా జిల్లాపరిషత్ వైస్‌చైర్మన్‌గా ఎంపికయ్యారు.
- జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి మండలంలో 30 పోలింగ్ బూత్‌లు, 17 పోలింగ్ కేంద్రాలు ఉన్నా యి. పకడ్బందీగా పోలింగ్ ప్రక్రియ నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేసుకుంటున్నారు.



ఏకశిలానగరం (ఒంటిమిట్ట)

ఓటర్లలిలా..

మండలంలో 24,606 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 12,556 మహిళలు, పురుషులు 12,050 మంది ఉన్నారు. ఎన్నికల అధికారుల ఓటర్ల జాబితాను అందుబాటులోకి తీసుకొచ్చారు.

మండలం: ఒంటిమిట్ట
పోలింగ్ కేంద్రాలు: 17
పోలింగ్‌బూత్‌లు: 30
మొత్తం ఓటర్లు: 24,606
మహిళలు: 12,556
పురుషులు: 12,050

తేలని కూటమి అభ్యర్థి ఎంపిక

కూటమి పార్టీ అభ్యర్థుల ఎంపిక విషయం ఇంకా తేలలేదు. వర్గాల వారీగా నామినేషన్లు దాఖలు చేసుకున్నారు. పార్టీ బీ-ఫాం ఎవరికి ఇస్తుందన్నది ఇప్పుడు ప్రశ్నార్థకరంగా మారింది. ముద్దుకృష్ణరెడ్డి అడ్డలూరు,కడప బాబుసాహెబ్, బొడ్డె వెంకటరమణ(2సెట్లు), దున్నతల రఘురాంరెడ్డి,వెంకటేశ్ నంద్యాల,వెంకటసుబ్బయ్య ఆలూరు, కుమారి శివరామకృష్ణారెడ్డి, నల్లగొండు వెంకటసుబ్బారెడ్డిలు నామినేషన్లు వేశారు అయితే రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారికే టీడీపీ బీ-ఫాం ఇస్తుందనే భావనలు కూటమి వర్గాల్లో కొనసాగుతున్నాయి.

- కాంగ్రెస్ పార్టీ నుంచి రాజంపేటకు చెందిన బలిజ సామాజికవర్గానికి చెందిన పూలభాస్కర్ నామినేషన్ దాఖలు చేశారు.

వైఎస్సార్‌సీపీ నుంచి..



ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ అభ్యర్థి

వైఎస్సార్‌సీపీ నుంచి ఇరగంరెడ్డిసుబ్బారెడ్డి, ఇరగంరెడ్డి శ్రీకర్‌రెడ్డిలు నామినేషన్లు దాఖలు చేశారు. ఇప్పటికే ప్రచారంలో ముందంజలో ఉన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథరెడ్డి, కడప నగర మేయర్ సురేష్ బాబులు సుబ్బారెడ్డి గెలుపు కోసం ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు.

ఒంటిమిట్ట నుంచే జెడ్పీ పీఠంపై ఆకేపాటి



ఆకేపాటి అమరనాథరెడ్డి

ఒంటిమిట్ట జెడ్పీటీసీగా ఉన్న సమయంలో ఆకేపాటి అమరనాథరెడ్డి జిల్లా పరిషత్ చైర్మన్‌గా నియమితులైయ్యారు. తనదైన రీతిలో జిల్లాపరిషత్ పరంగా ప్రజలకు సేవలందించారు. గత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు జెడ్పీటీసీకి రాజీనామా చేశారు. ప్రస్తుతం ఆయన రాజంపేట ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. అన్నమయ్య వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షునిగా ఉన్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి గెలుపు కోసం ఎన్నికల ప్రచారం ముమ్మరంగా చేస్తున్నారు.

ప్రభుత్వం సహకరిస్తే పతకాలు సాధిస్తాం

శాప్ డైరెక్టర్ రమణరావు



మాట్లాడుతున్న శాప్ డైరెక్టర్ ఆరికపూడి రమణరావు

కడప రూరల్: ప్రభుత్వం సహకరిస్తే పతకాలు సాధిస్తామని ద్రోణాచార్య అవార్డు గ్రహీత, రాష్ట్ర క్రీడా సాధికార సంస్థ డైరెక్టర్ (శాప్) ఆరికపూడి రమణరావు అన్నారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. శాప్ చైర్మన్ ఆదేశాల మేరకు కడప క్రీడా పాఠశాలను తనిఖీ చేశామన్నారు. ఈ సందర్భంగా క్రీడా మైదానాలు, క్రీడాకారుల మౌలిక సదుపాయాలను పరిశీలించామన్నారు. అలాగే క్రీడాకారులతో మాట్లాడామని తెలిపారు. క్రీడల్లో పతకాలు సాధించాలంటే నిధుల అవసరం ఎంతో ఉంటుందన్నారు. క్రీడలకు బడ్జెట్‌లో అధిక శాతం నిధులు కేటాయించినపుడు జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో రాణించవచ్చన్నారు. ప్రభుత్వం ఆర్థికంగా చేయూతనందిస్తే పతకాలను సాధిస్తామని తెలిపారు. మరో డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటివరకు ఏడు వేల మంది ఫిజికల్ డైరెక్టర్లు ఉన్నారని, మరో రెండు వేల మంది ఫిజికల్ డైరెక్టర్లు రానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్లు తమ సమస్యలను విన్నవించి పరిష్కరించాలని కోరారు. జిల్లా స్కూలు గేమ్స్ సెక్రటరీ అరుణకుమారి, రాష్ట్ర పీఈటీ అసోసియేషన్ సెక్రటరీ ప్రవీణ్ కిరణ్, వ్యాయామ ఉపాధ్యాయులు సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

నల్లతుమ్మ చెట్ల అక్రమ రవాణా

- అడ్డగోలుగా ప్రభుత్వ కుంటలలో చెట్ల విక్రయం
- అటవీశాఖ అధికారుల చేతివాటంతో యథేచ్ఛగా తరలిస్తున్న వైనం
- స్థానికుల అభ్యంతరాలను పట్టించుకోని అధికారులు




వాల్మీకిపురం : మంచూరులోని ప్రభుత్వ భూములలో నరికివేసిన నల్లతుమ్మచెట్లు

కలికిరి(వాల్మీకిపురం) : ప్రభుత్వ, అటవీ భూముల్లో చెట్లను నరికితే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుంది. అటవీ చట్టం 1967, ఏపీ వాల్టా 2002 చట్టం మేరకు చెట్లను నరికివేయడం నిషేధం. ప్రభుత్వ ప్రయోజనాలకు అవసరమైతే సంబంధిత జిల్లా కలెక్టర్‌కుగానీ, జిల్లా అటవీశాఖ అధికారికి గానీ ఫారం -13 మేరకు దరఖాస్తు చేసుకోవాలి. జిల్లా స్థాయి అధికారులు సదరు ప్రాంతాన్ని పరిశీలించి చెట్ల నరికివేతకు అనుమతులు ఇవ్వాలా లేదా అని నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. దీంతో పాటు ఆయా గ్రామస్తుల అభిప్రాయాలు కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

పీలేరు నియోజకవర్గంలోని వాల్మీకిపురం మండలం మంచూరు గ్రామ పంచాయతీ పరిధిలో సర్పంచ్ జ్యోతి, భర్త సురేష్ ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ప్రభుత్వ భూములలోని ఏళ్ల నాటి నల్లతుమ్మ చెట్లను విక్రయించి సొమ్ము చేసుకున్న ఘటన వెలుగు చూసింది. మంచూరు గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 409లో గల తిమ్మిరెడ్డికుంటలో చెట్ల నరికివేతకు అటవీశాఖ, పంచాయతీరాజ్ శాఖ అధికారుల నుంచి అనుమతులు పొందాడు. కేవలం చెట్లు కత్తిరించేందుకు మాత్రమే అటవీశాఖ అధికారులు అనుమతులు జారీ చేశారు. ఇదే అదనుగా భావించిన సురేష్ తన భార్య పదవిని అడ్డుపెట్టుకుని తిమ్మిరెడ్డికుంట సమీపంలోని కొత్తకుంటపై కన్నేసి ఆ కుంటలోని చెట్లను అక్రమంగా విక్రయించేశాడు. అయితే అటవీశాఖ అధికారులు కలప ట్రాన్స్‌పోర్ట్‌కు ఎలాంటి అనుమతులు మంజూరు చేయలేదు. నల్లతుమ్మ కొయ్య కలపకు మంచి డిమాండ్ ఉండటంతో వాల్మీకిపురానికి చెందిన కొయ్య వ్యాపారులు అక్రమంగా నల్లతుమ్మ కలపను తరలించినట్లు సమాచారం. ప్రభుత్వ భూముల్లో చెట్ల నరికివేతపై గ్రామస్తులు ప్రశ్నించినా పంచాయతీ కార్యదర్శిగానీ, సర్పంచ్‌గానీ సమాధానం చెప్పక పోవడంతో గ్రామస్తులు ఇప్పటికే మండల స్థాయిలో ఎంపీడీఓ, తహసీల్దారుకు ఫిర్యాదు చేసి అక్రమాలపై వినతిపత్రాలు అందజేశారు. వారు స్పందించక పోవడంతో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూముల్లో చెట్ల నరికివేతలో లక్షలాది రూపాయలు చేతులు మారాయని, అక్రమాలకు అధికారులు వత్తాసు పలికారని, క్షేత్ర స్థాయిలో ఉన్నతాధికారులు విచారిస్తే నిజానిజాలు వెలుగు చూస్తాయని ఫిర్యాదులో పేర్కొన్నారు.

అటవీశాఖ అధికారుల చేతివాటం..

తరిగొంట అటవీ బీట్ పరిధిలోని మంచూరు గ్రామ పంచాయతీలోని తిమ్మిరెడ్డికుంటలో ఉన్న నల్లతుమ్మచెట్ల నరికివేతకు సంబంధించి ఉన్నతాధికారుల నుంచి అనుమతులు మంజూరుకు, అనుమతులు లేని మరో కొత్తకుంటలో చెట్ల నరికివేతకు సంబంధిత అటవీ బీట్ అధికారి సుబ్బలక్ష్మీ, ఇన్‌చార్జి సెక్షన్ అధికారి సుధాకర్ ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలున్నాయి. కొత్తకుంట, తిమ్మిరెడ్డికుంట నుంచి కలప అనుమతులు లేకుండా తరలుతున్నా కేవలం నామమాత్రంగా ఒక టన్నుకు మాత్రమే జరిమానా విధించి రశీదు ఇచ్చారు. విక్రయదారు, కలప వ్యాపారుల నుంచి అటవీశాఖ అధికారులకు మామూళ్లు ముట్టడంతోనే కలప ట్రాన్స్‌పోర్ట్‌కు అనుమతులు లేకున్నా చూసీ చూడనట్లు వ్యవహరించారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

అక్రమాలపై విచారణ జరిపించాలి



మంచూరు గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తకుంట, తిమ్మిరెడ్డికుంటలలో సుమారు 50 ఏళ్ల కాలం నాటి నల్లతుమ్మచెట్లను నరికివేశారు. గ్రామస్తులు అభ్యంతరం తెలిపినా అధికారులు ఎవ్వరూ పట్టించుకోలేదు. చెట్లను విరివిగా నాటాలని, కాపాడాలని ప్రభుత్వాలు చెబుతున్నా ఇలా చెట్లను నరికివేయడం అన్యాయం. ప్రభుత్వ భూములలో చెట్లు అక్రమంగా నరికివేతపై సమగ్ర విచారణ చేపట్టాలి.

– శంకర్‌రెడ్డి, మంచూరు గ్రామం

వీరభద్రస్వామిని దర్శించుకున్న కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి



వీరభద్రస్వామి సన్నిధిలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి బసవరాజు

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ వీరభద్రస్వామిని కర్ణాటక రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి బసవరాజు దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామి వారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన శంకర

మదనపల్లె రూరల్ : ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిని లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి పరిస్థితి విషమంగా మారిన ఘటన ఆదివారం మదనపల్లి మండలంలో జరిగింది. వేంపల్లి దళితవాడకు చెందిన శంకర (52) బెంగళూరు రోడ్‌లో సప్లయర్స్ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆదివారం ద్విచక్ర వాహనంలో వ్యక్తిగత పనులపై చీకల బైలుకు వెళ్తుండగా, మార్గమధ్యంలోని బార్లపల్లి వద్ద ఎదురుగా వచ్చిన లారీ ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్న బాధితుడిని స్థానికులు మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అత్యవసర విభాగంలో చికిత్స అందించిన అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ఆటో ఢీకొని..



తీవ్రంగా గాయపడిన నవీన్

మదనపల్లె రూరల్ : ఆటో ఢీకొని వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం రాత్రి కురబలకోట మండలంలో జరిగింది. మదనపల్లె పట్టణం అగడ్తలవీధికి చెందిన ఉదల్‌సింగ్ కుమారుడు నవీన్ సింగ్(24) బి.కొత్తకోట మండలం గట్టులో నూతన వస్త్ర దుకాణం ప్రారంభించాడు. రాత్రి మదనపల్లె నుంచి ద్విచక్రవాహనంలో గట్టుకు బయలుదేరి వెళుతుండగా, మార్గమధ్యంలోని విశ్వం కాలేజ్ సమీపంలోని పెట్రోల్‌బంకు వద్ద ఆటో మలుపు తిరుగుతుండగా వేగంగా వెళ్లి ఢీకొన్నాడు. ప్రమాదంలో నవీన్‌సింగ్ తీవ్రంగా గాయపడగా, ఆటో డ్రైవర్ సునీల్(25) స్వల్పంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించడంతో బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు.

మద్యానికి బానిసలై ఇద్దరి మృతి



మద్యానికి బానిసై మృతి చెందిన పవన్

మదనపల్లె రూరల్ : వేర్వేరు ఘటనల్లో మద్యానికి బానిసైన ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. మండలంలోని బసినికొండకు చెందిన లక్ష్మన్న, పద్మ దంపతుల కుమారుడు పవన్ (40)కు 15 సంవత్సరాల క్రితం భారతితో వివాహం కాగా, పెళ్లయిన ఏడాదికే ఆమె అనారోగ్య కారణాలతో మృతి చెందింది. అప్పటినుంచి పవన్ మద్యానికి బానిసై, పనులకు వెళ్లకుండా నిత్యం మద్యం తాగుతూ ఉండేవాడు. ఆదివారం బసినికొండ సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద, అతిగా మద్యం తాగి అపస్మారక స్థితిలో పడి ఉండగా, గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన అత్యవసర విభాగం వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో కుటుంబ సభ్యులు మృతదేహాన్ని ఇంటికి తీసుకువెళ్లారు. అదేవిధంగా పట్టణంలోని మార్పూరి వీధికి చెందిన ఖాదర్ బాషా కుమారుడు షరీఫుద్దీన్ (38) మద్యానికి బానిసై కుటుంబాన్ని నిర్లక్ష్యం చేసి పనులకు వెళ్లకుండా నిత్యం మద్యం తాగేవాడు. అతని భార్య హమీదా స్థానికంగా కూలి పనులకు వెళ్తూ కుమారుడిని కుటుంబాన్ని పోషించుకుంటుంది. ఈ క్రమంలో ఆదివారం ఉదయం ఆమె పనులకు వెళ్లి మధ్యాహ్నం భోజనానికి ఇంటికి రాగా, భర్త షరీఫుద్దీన్ అపస్మారక స్థితిలో పడి ఉండగా, గమనించి వెంటనే ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి స్థానికుల సాయంతో తరలించింది. పరీక్షించిన వైద్యులు బాధితుడు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం ఇంటికి తీసుకువెళ్లారు.

ట్రాక్టర్ అదుపు తప్పి వ్యక్తి మృతి



ప్రమాదంలో మృతి చెందిన వెంకటరత్నం

కలకడ : ట్రాక్టర్ అదుపు తప్పి ఒక వ్యక్తి మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలైనట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. ఆయన కథనం మేరకు.. శనివారం రాత్రి కలకడ మండలంలోని రాతిగుంటపల్లె పంచాయతీ, బట్టావారిపల్లె సమీపంలోని టమాటా పంట సాగుకు వినియోగించే సీడ్స్ కర్రలను కలకడ మండలంలోని దేవులపల్లెకు తరలిస్తుండగా రాతిగుంటపల్లె పంచాయతీ లక్ష్మీపురం గ్రామం మలుపువద్ద ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో దేవులపల్లెకు చెందిన వెంటరత్నం (38) అక్కడికక్కడే మృతి చెందగా, గుర్రంకొండ మండలం మర్రిమేకలవారిపల్లె దళితవాడకు చెందిన నరసింహులుకు కాలు విరిగి తీవ్ర రక్త గాయాలయ్యాయి. మృతుని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సెప్టెంబర్ 8 నుంచి కడపలో వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కౌన్సిల్ సమావేశాలు



మాట్లాడుతున్న అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : సెప్టెంబర్ 8,9,10, తేదీలలో అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కౌన్సిల్ సమావేశాలు కడప నగరంలో నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం కడప నగరంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో

భూ పంపిణీ –సాగునీరు – పారిశ్రామిక అభివృద్ధి అనే అంశంపై రాష్ట్ర సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కౌన్సిల్ సమావేశాలకు దేశవ్యాప్తంగా 29 రాష్ట్రాల నుంచి 200 మంది జాతీయ నాయకులతో పాటు కేరళ, బెంగాల్, త్రిపుర, తమిళనాడు, రాజస్థాన్ రాష్ట్రాల నుంచి ఎన్నికైన ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరవుతారని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం భూమి లేని పేదలకు భూ పంపిణీ చేపట్టాలని డిమాండ్ చేశారు. 'ఉంటే ప్రభుత్వ భూముల్లో ఉంటాము– లేకుంటే జైల్లో ఉంటాము' అనే నినాదంతో వ్యవసాయ కార్మికులందరూ గ్రామ, గ్రామాన దండుగా ఐక్య భూ పోరాటాలకు సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. భూమిలేని గ్రామీణ నిరుపేదలకు భూ పంపిణీ చేస్తేనే నిజమైన అభివృద్ధి సాధ్యమని తెలిపారు. కేరళలోని వామ పక్ష ప్రభుత్వం ప్రతి కుటుంబానికి 3 ఎకరాల భూమి, ప్రతి వ్యవసాయ కార్మికునికి రోజువారీ కూలి 1000 రూపాయలు ఇస్తోందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంబానీ, అదానీలకు 20 లక్షల కోట్ల ఆదాయం పెంచారని, వ్యవసాయ కార్మికులకు రోజువారి ఆదాయం 200 కూడా పెంచలేదని విమర్శించారు. జిల్లాలో మొదటి విడతగా 7 మండలాల్లో 20 గ్రామాలలో భూ పోరాటాలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జి.చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వి.అన్వేష్, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఐ.ఎం.సుబ్బమ్మ, చేతి ఉత్పత్తిదారుల సంఘం జిల్లా నాయకులు వి.పి.బయన్న, వీ.శివ నారాయణ, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.చిన్ని, వి.శివకుమార్, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.జకరయ్య తదితరులు పాల్గొన్నారు.

కారును ఢీకొన్న ద్విచక్ర వాహనం

ఒకరికి తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన బోనంశెట్టి రవీంద్ర

రామాపురం (రాయచోటి జగదాంబసెంటర్) : రామాపురం మండలం కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ దళితవాడ సమీపంలో ఆదివారం ఆగి ఉన్న కారును టీవీఎస్ ఎక్సెల్ ఢీకొన్న సంఘటనలో బోనంశెట్టి రవీంద్ర అనే వ్యక్తికి తీవ్ర గాయాలైనట్లు రామాపురం పోలీసులు తెలిపారు. కడప నుంచి రాయచోటి వైపు వెళ్తున్న టీఎస్ 01ఏఈ 7263 నెంబర్ గల కారు గువ్వల చెరువు దళితవాడ సమీపంలో ఆగి ఉండగా వెనుకవైపు నుంచి సరస్వతిపల్లెకు చెందిన బోనంశెట్టి రవీంద్ర ఏపీ02బివి 8652 నెంబర్ గల టీవీఎస్ ఎక్సెల్‌లో వస్తూ ప్రమాదవశాత్తు కారును ఢీకొన్నాడు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని గాయపడిన వ్యక్తిని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రామాపురం పోలీసులు తెలిపారు.

మహిళా ప్రయాణికురాలిపై దురుసు ప్రవర్తన



మహిళా ప్రయాణికురాలితో దురుసుగా ప్రవర్తిస్తున్న కండక్టర్

వేంపల్లె : రాయచోటి ఆర్టీసీ డిపోకు చెందిన బస్సులో కండక్టర్ మహిళా ప్రయాణికురాలిపై దురుసుగా ప్రవర్తించాడు. ఆదివారం వేంపల్లె–రాయచోటి బస్సులో కండక్టర్ మహిళ మెడపై చెయ్యి వేసి నెట్టి ఆమెను దుర్భాషలాడాడు. ఆమె పోలీస్ స్టేషన్‌కు వెళ్దాం పద అన్న తర్వాత కండక్టర్ తగ్గాడు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న రాయచోటి డిపో బస్సులోనే ఇలా జరగడం చాలా బాధాకరమని ప్రయాణికులు మండిపడ్డారు.

చిన్నపాటి వర్షానికి కారడం దారుణం..



చిన్నపాటి వర్షానికి తడుస్తున్న ప్రయాణికులు

వేంపల్లె – రాయచోటికి ప్రయాణించే ఆర్టీసీ బస్సు చాలా దారుణంగా ఉందని ప్రయాణికులు మండిపడ్డారు. ఆదివారం రాయచోటి డిపోకు చెందిన ఏపీ02జెడ్ 0254 నంబర్ గల ఏపీఎస్ ఆర్టీసీ ఆర్డినరీ బస్సులో ప్రయాణికులు మొత్తం వర్షపు నీటితో తడిచి పోయారు. వర్షం పడితే ఆ బస్సులో ప్రయాణికులు స్నానం చేసినట్లే అని వాపోతున్నారు. ఈ బస్సులో ప్రతి కిటికీకి అద్దం ఒకటే ఉంది. రాయచోటి ఆర్టీసీ డీఎం గమనించి ఇలాంటి పాతబడిన, కాలం చెల్లిన బస్సులను నడపొద్దని ప్రయాణికులు కోరుతున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ములకలచెరువు: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి మండలంలో జరిగింది. స్థానికులు, పోలీసుల కథ మేరకు... బురకాయలకోట పంచాయితీకి చెందిన శ్రీనివాసులు(45), రిజ్వాన్(50) లు ద్విచక్ర వాహనంలో ములకలచెరువులో జరిగిన వివాహ వేడుకకు వెళ్లారు. తిరిగి బురకాల కోటకు వస్తుండగా వెనుక వైపు నుంచి గుర్తు తెలియని వాహనం వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీనివాసులు సంఘటన స్థలంలో మృతి చెందాడు. రిజ్వాన్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని మదనపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.